నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శనివారం 29 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంత్ కే. జెండగే

సంక్షేమ వసతి గృహాల్లో నిరంతర పర్యవేక్షణ

- భోజనం, సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలి
- అధికారుల సమావేశంలో కలెక్టర్ హనుమంత్ కే. జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూన్ 28 : సంక్షేమ వసతి గృహాల్లో నిరంతర పర్యవేక్షణ, విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ఉండాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ సంక్షేమ శాఖల అధికారులు, సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్లతో ఆయన సమావేశమయ్యారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున డార్మిటరీలో విద్యార్థుల ట్రంక్ పెట్టెలు అస్తవ్యస్తంగా ఉండొద్దని, స్టడీ రూములను శుభ్రం చేయించాలని, వాష్ రూములు, టాయ్‌లెట్స్‌ను బ్లీచింగ్ పౌడర్‌తో క్లీన్‌గా ఉంచాలని సూచించారు. సరుకులు, స్టోర్ రూమ్‌ను పరిశీలించాలని, పాత స్టాక్‌ను పరీక్షించి గడువు ముగిసిన వాటిని తీసివేయాలని తెలిపారు. వర్షాకాలం కాబట్టి పొడి వాతావరణంలో వంట సామగ్రి వుండేలా చూడాలని, చిన్న విషయాల పట్ల కూడా జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. కలుషిత నీటితో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, పాఠశాల, హాస్టల్ ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూడాలని తెలిపారు. ప్రతి రెండు వారాలకు ఒక సారి ట్యాంకులను కడిగించాలని, ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. వసతి గృహాల రిజిస్టర్లను అధికారులు తనిఖీ చేయాలని, సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి అన్ని వసతి గృహాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, వైద్యులు విజిట్ చేయాలని తెలిపారు. ప్రతి రెండు నెలలకోసారి విద్యార్థులకు ప్రేరణ కలిగించే కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారికి సూచించారు. వసతి గృహాల నిర్వహణలో లోపాలు ఉంటే చర్యలు తీసుకుంటామని కలెక్టరు అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎంఏ కృష్ణన్, జిల్లా వైద్య అధికారి పాపారావు, జిల్లా పంచాయతీ అధికారి సునంద, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి యాదయ్య, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జయపాల్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, వసతి గృహాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

పదవి లేకున్నా సమాజ సేవలో ముందుండాలి

- జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి



ఆత్మీయ వీడ్కోలు సన్మానం పొందిన ఎంపీటీసీలతో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

బొమ్మలరామారం, జూన్28 : పదవీ కాలం పూర్తయిన తర్వాత కూడా ప్రజా ప్రతినిధులు సమాజ సేవలో ముందుండాలని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అన్నారు. బొమ్మలరామారం ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ చిమ్ముల సుధీర్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు పెంచడానికి ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులకు సహకారం అందించాలని అన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ఆధ్వర్యంలో పనులు వేగవంతం జరిగేలా అధికారులు కృషిచేయాలని సూచించారు. సర్పంచుల పదవీ కాలం ముగియగ, ఎంపీటీసీల పదవీకాలం త్వరలో ముగుస్తునందున పరిపాలన భారం ప్రత్యేక అధికారులు మీద ఉంటుందని , ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ఐదేండ్లలో అధిక నిధులు తీసుకొచ్చి మండల సమగ్ర అభివృద్ధికి చేశానని చెప్పారు. అనంతరం ఎంపీటీసీలు, జడ్పీటీసీకి ఆత్మీయ వీడ్కోలు సన్మానాన్ని ఎంపీడీఓ రాజా త్రివిక్రమ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ గూదె బాలనర్సింహ, మండల ప్రత్యేక అధికారి జ్యోతికుమార్, ఎంఈఓ కృష్ణ, ఎంపీటీసీలు, వివిధ శాఖల ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గిన సందర్భంగా విజయ సంకేతం చూపుతున్న డైరెక్టర్లు

డీసీసీబీ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- 19 మంబిలో 15 మంది హాజరు
- తాత్కాలిక చైర్మన్‌గా ఎన్నికైన వైస్ చైర్మన్ దయాకర్ రెడ్డి
- జూలై 1న డీసీఓ సమక్షంలో కొత్త చైర్మన్ ఎన్నిక

నల్లగొండ, జూలై 28 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డిపై ప్రతిపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీసీసీబీలో శుక్రవారం డీసీఓ కిరణ్ కుమార్ సమక్షంలో జరిగిన అవిశ్వాస పరీక్షలో అనుకూలం కంటే వ్యతిరేక ఓట్లు ఎక్కువగా ఉండటంతో గొంగిడిపై పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్టయ్యింది. ఉదయం 11 గంటలకు డీసీసీబీలో డీసీఓ కిరణ్ కుమార్ సమక్షంలో ఈ అవిశ్వాస పరీక్ష జరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సహకార బ్యాంకు డైరెక్టర్లు మొత్తం 20 మంది ఉండగా అందులో ఒకటి ఖాళీ ఉంది. ఇక మిగిలిన 19 మందిలో చైర్మన్ మహేందర్‌రెడ్డితో పాటు అప్పిరెడ్డి, రంగాచారి, ప్రవీణ్ రెడ్డి మినహా 15 మంది డైరెక్టర్లు హాజరై చైర్మన్‌కు వ్యతిరేకంగా ఓటు చేశారు. దాంతో ప్రతిపక్ష సభ్యులు పెట్టిన అవిశ్వాసం నెగ్గినట్లు డీసీఓ కిరణ్ కుమార్ ప్రకటించారు. అవిశ్వాసం నెగ్గడంతో వెంటనే చైర్మన్ కొత్త చైర్మన్ ఎన్నిక చేయలేనందున ప్రస్తుతం వైస్ చైర్మన్‌గా ఉన్న ఎసిరెడ్డి దయాకర్ రెడ్డిని తాత్కాలిక చైర్మన్‌గా డీసీఓ నియమించారు. జూలై 1న కొత్త చైర్మన్‌ను ఎన్నుకోవడానికి సభ్యులందరూ హాజరు కావాలని సూచిస్తూ ఆయన వెంటనే అందరికీ నోటీసులు అందజేశారు. అప్పటి వరకు దయాకర్‌రెడ్డి తాత్కాలిక చైర్మన్‌గా వ్యవహరించనున్నారు. అవిశ్వాస ఘట్టం ముగిసిన అనంతరం కాంగ్రెస్ శ్రేణులు డీసీసీబీ వద్దకు చేరుకొని పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు.

నూతన చైర్మన్‌గా శ్రీనివాస్ రెడ్డి

కొత్త చైర్మన్‌గా కోమటిరెడ్డి రాజ్‌గోపాల్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, మునుగోడు పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డిని ఎన్నుకోనున్నారు. గడిచిన 15 రోజులుగా డైరెక్టర్లను క్యాంపునకు తీసుకెళ్లి అన్ని ఏర్పాట్లు చేసింది కూడా ఆయనే. కొత్తగా ఎన్నికైన చైర్మన్ వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు కొనసాగనుండగా ప్రభుత్వం ఒకవేళ అదనపు సమయం ఇస్తే ఎక్కువ కాలం కూడా ఉండే అవకాశం ఉంది.

రైతు సంక్షేమం కోసం పాటుపడతాం : ఎసిరెడ్డి, కుంభం

డీసీసీబీలో అవిశ్వాసం నెగ్గిన అనంతరం తాత్కాలిక చైర్మన్‌గా ఎన్నికైన ఎసిరెడ్డి దయాకర్ రెడ్డితో పాటు కాబోయే కొత్త చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ పాలక వర్గానికి ఉన్న సమయంలో రైతు సంక్షేమం కోసం పాటుపడతామని ప్రకటించారు. ప్రభుత్వం అందజేసే ఫలాలు ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకుంటామని, పాలక వర్గం డైరెక్టర్ల సలహాలు, ఉద్యోగుల సహకారంతో ముందుకు పోతామని తెలిపారు.

రూ.150 టికెట్ల దందాపై గుట్ట దేవస్థానం సీరియస్

- కొండపైన కొబ్బరి చిప్పల సేకరణ కాంట్రాక్టర్‌పై చర్యలు

యాదగిరిగుట్ట, జూన్ 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో రూ.150 టికెట్ల దందాపై దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు కొబ్బరి చిప్పల సేకరణ కాంట్రాక్టర్ బిట్టు కిశోర్ టెండర్ రద్దు చేసేందుకు నోటీసులు జారీ చేశారు. టికెట్ల దందా నిర్వహిస్తున్న టంటం వెంకటేశ్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 27న హైదరాబాద్‌కు చెందిన సుధాకర్ తన కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారితో కలిసి స్వామివారి దర్శనానికి వచ్చారు. వారంతా రూ.150 దర్శన టికెట్లు తీసుకుని స్వర్ణవర్ణపు క్యూ లైన్‌లోకి వెళ్లారు. కొబ్బరికాయ కొట్టే ప్రదేశంలో ఉన్న వ్యక్తి టికెట్లను తీసుకుంటున్నట్లు భక్తులు మహద్వారం వద్ద ఎస్‌పీఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. సిబ్బంది సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి టంటం వెంకటేశ్ భక్తుల నుంచి టికెట్లు వసూలు చేస్తున్నట్లు గుర్తించారు. అతడిని వెంటనే అదుపులోకి తీసుకుని తనిఖీ చేసి టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. టికెట్లను వసూలు చేస్తూ తిరిగి విక్రయించే ప్రయత్నం చేసి దేవస్థానానికి ఆర్థిక నష్టం కగిలిస్తున్నట్లు నిర్ధారించారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పట్టణ సీఐకి దేవస్థానం అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనకు కారణమైన కొబ్బరి చిప్పల సేకరణ కాంట్రాక్టర్ బిట్టు టెండర్ రద్దు చేసేందుకు నోటీసులు జారీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అలర్ట్

రోగాలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తం

వ్యాధి వ్యాప్తి చెందకుండా యాక్షన్ ప్లాన్
జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ల ఏర్పాటు
కేసులు తేలితే రంగంలోకి బృందాలు
ముందస్తు నివారణకు అన్ని శాఖల భాగస్వామ్యం
జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

పోచంపల్లిలో డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ పాపారావు (ఫైల్)



సీజనల్ వ్యాధులపై జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. కేసులు పెరుగక ముందే యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంది. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. ఈ బృందం ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండి, కేసులు పెరుగకుండా పర్యవేక్షిస్తుంది. జిల్లా స్థాయి, పీహెచ్‌సీ స్థాయిల్లో 24గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. మరోవైపు గ్రామాల్లో పారిశుధ్యం కోసం సంబంధిత విభాగాలన్నీ రంగంలోకి దిగాయి. ఇప్పటికే డ్రైడే, ఫ్రై డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

– యాదాద్రి భువనగిరి, జూన్ 28 (నమస్తే తెలంగాణ)

వైద్యారోగ్య శాఖ యాక్షన్ ప్లాన్..

వర్షాకాలం కావడంతో సాధారణంగా సీజనల్ వ్యాధులు విజృంభిస్తాయి. ముఖ్యంగా డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా, పైలేరియా లాంటి వ్యాధులు ప్రబలుతుంటాయి. దాంతో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో నిర్లక్ష్యమే పెద్దదిగా మారుతుంది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ రోగాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లాలో నాలుగు సబ్ యూనిట్లు ఉన్నాయి. జిల్లా, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇవి 24గంటల పాటు పనిచేయనున్నాయి. డెంగీ వ్యాధి మరింత ప్రమాదమని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు 4 డెంగీ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. గతేడాది 26 డెంగీ కేసులు నమోదయ్యాయి. గతేడాది నుంచి జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాకపోవడం విశేషం. అయితే అన్ని జ్వరాలు డెంగీ, మలేరియా కాదని, ప్రజలు ఆందోళన చెందవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

అన్ని శాఖల భాగస్వామ్యం..

వ్యాధుల నేపథ్యంలో ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంది. ఇప్పటికే పీహెచ్‌సీల్లో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నది. అదే విధంగా అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచింది. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లకు దాదాపు లక్ష ఓఆర్ఎస్ ప్యాకెట్లు, క్లోరిన్ ట్యాబ్లెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, డిస్‌ఇన్ఫెక్టెంట్స్, ఎమెర్జెన్సీ మెడిసిన్‌ను సరఫరా చేసింది. సీజనల్ వ్యాధుల నివారణలో వైద్యశాఖతోపాటు ఇతర శాఖలను కూడా ప్రభుత్వం భాగస్వామ్యం చేసింది. వైద్య, ఆరోగ్య, మున్సిపల్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో ముందుకెళ్తున్నాయి. జిల్లా స్థాయి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిల్లో అన్ని సంబంధిత శాఖలతో కో ఆర్డినేషన్ కమిటీ మీటింగ్‌లు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగం, నులిపురుగుల నిర్మూలన, బహిరంగ మల విసర్జనపై ప్రచారం చేస్తున్నారు.

ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్..

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఇవి ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండి, చర్యలు తీసుకుంటాయి. బృందంలో జిల్లా మలేరియా అధికారి, జిల్లా సహాయ మలేరియా అధికారి, ముగ్గురు సబ్ యూనిట్ ఆఫీసర్లు ఉంటారు. వీరు ఎప్పటికప్పుడు జిల్లాలో సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేస్తుంటారు. ఒకే గ్రామంలో మూడు, నాలుగు కేసులు నమోదైన వెంటనే సదరు గ్రామానికి వెంటనే చేరుకుంటారు. పాజిటివ్ వచ్చిన ఇంటిని పూర్తిగా పరీక్షిస్తారు. కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఇంట్లో సైతం స్ప్రే చేస్తారు. అంతేకాకుండా చుట్టు పక్కల ఉండే సుమారు 50ఇండ్లలో ఉంటున్న వారికి కూడా పరీక్షలు చేస్తారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి
- శరీరాన్ని పూర్తిగా కప్పే ఉంచిన దుస్తులు ధరించాలి
- వారానికోసారి నీటి తొట్లు, ఇతర పాత్రలను శుభ్రంగా కడిగి, తుడిచి నీరు నింపుకోవాలి
- ఇంటి లోపల, బయట పనికిరాని చెత్తను ఉంచకుండా చూసుకోవాలి
- నీళ్ల ట్యాంక్‌లు, డ్రమ్ములు, మంచి నీటి పాత్రలపై మూతలు అమర్చాలి
- ఉదయం, సాయంత్రం 5నుంచి 6గంటల సమయంలో తలుపులు, కిటికీలు మూసి ఉంచాలి, దోమతెరలను వాడాలి

అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. జ్వరం బాగా వచ్చిన వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. రెండు రోజుల కంటే ఎక్కువ సమయంపాటు జ్వరంగా వస్తే ఆలస్యం చేయకూడదు. ప్రభుత్వ ఆస్పత్రిల్లో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవచ్చు. చికిత్స సమయంలో రోగులు జాగ్రత్తగా ఉండాలి. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు లేకుండా చూసుకోవాలి.

-డాక్టర్ పాపారావు, డీఎంహెచ్‌ఓ

శివన్నగూడెం ప్రాజెక్టు నిర్వాసితులకు త్వరలో ప్లాట్లు

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

శివన్నగూడెం ప్రాజెక్టు నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

మర్రిగూడ, జూన్ 28 : శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురవుతున్న గ్రామాల ప్రజలకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ఏరియాలో విలువైన పాట్లు ఇప్పించేందుకు కృషి చేస్తానని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాతానన్నారు. మండలంలోని వెంకెపల్లి, వెంకెపల్లి తండా, నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. ఇబ్రహీంపట్నంలో సాధ్యపడకపోతే జిల్లాలోని చింతపల్లితోపాటు పలు ప్రాంతాల్లో ప్లాట్లను కేటాయిస్తామని హామీ ఇచ్చారు. తనకు రెండు నెలలు గడువు ఇవ్వాలని, ఈ లోపు ప్రభుత్వంతో చర్చలు జరిపి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూ నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. అప్పటివరకు నర్సిరెడ్డిగూడెం గ్రామస్తులు పనులకు సహకరించాలని కోరారు. రోడ్డును తొలగించి కట్టను నిర్ణీత ఎత్తు వరకే నిర్మిస్తారని, దాంతో వర్షం నీరు గ్రామంలో నిలిచే అవకాశం లేదని ఇంజినీర్లు చెప్పినట్లు వెల్లడించారు. పనులు ఆపితేనే నష్టపరిహారం వస్తుందనుకుంటే పొరపాటని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టు నిర్మాణం 90శాతం పూర్తయిందని, ప్రభుత్వంతో కొట్లాడైనా రెండు మూడేండ్లలో ప్రాజెక్టును పూర్తి చేస్తానని తెలిపారు.

ప్లాట్లు ఇచ్చాకే రోడ్డును తొలగించండి : నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులు

ముందుగా ప్లాట్లు ఇచ్చిన తర్వాతే గ్రామానికి వచ్చే రోడ్డును తొలగించి కట్ట పనులు చేపట్టాలని నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితులు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు. రోడ్డు తొలగించి కట్ట నిర్మాణం చేపడితే గ్రామం ముంపునకు గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, భూ నష్టపరిహారం అందని వాళ్లు ఇంకా ఉన్నారని వాపోయారు. పునరావాసం కల్పించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఇండ్లలోకి నీళ్లు రానివ్వమని, ప్రతి ఒక్కరికీ ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం, ప్లాట్లను అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆయన వెంట ఇరిగేషన్ ఈఈ రాములు నాయక్, ఎంపీపీ గండికోట రాజమణిహరికృష్ణ ఉన్నారు.

చొల్లేరు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ అసిస్టెంట్ సెక్రటరీ గామినీ సింగ్లా

అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ఆరా

- పరిశీలించిన కేంద్రస్త్రీ శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ

యాదగిరిగుట్ట, జూన్28 : అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలన చేపట్టారు. యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామంలో గల అంగన్‌వాడీ –2 కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ అసిస్టెంట్ సెక్రటరీ గామినీ సింగ్లా పరిశీలించారు. మాతా శిశు సంక్షేమానికి సంబంధించిన సేవలను ఆమె పరిశీలించారు. పిల్లల పెరుగుదల, పర్యవేక్షణ, పిల్లల మానసిక, శారీరక అభివృద్ధిని అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ విధానం, ఒక పూట సంపూర్ణ భోజనం, పోషణ్ ట్రాకర్ యాప్ పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఎన్.మోతి, మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి, సీడీపీఓ చంద్రకళ, సూపర్ వైజర్ జంగమ్మ పాల్గొన్నారు.



క్రిమినల్ మేజర్ చట్టాలను రద్దు చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

క్రిమినల్ మేజర్ చట్టాలను రద్దు చేయాలి

- బార్ అసోసియేషన్, ఐలు జిల్లా అధ్యక్షులు హరినాథ్, వెంకట్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జూన్ 28 : క్రిమినల్ మేజర్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బబ్బురి హరినాథ్, ఐలు జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. భువనగిరి బార్ అసోసియేషన్ ఎదుట శుక్రవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొత్త క్రిమినల్ మేజర్ చట్టాలు న్యాయ వ్యవస్థపై ప్రతికూల ప్రభావాలను చూపుతాయని, అమలు చేయతలపెట్టిన వాటిని రద్దు చేయాలని అన్నారు. నేడు బార్ అసోసియేషన్ హాల్‌లో జిల్లా స్థాయి శిక్షణ తరగతులు జరుగుతాయని, న్యాయవాదులందరూ పాల్గొనాలని కోరారు. న్యాయవాదులు గజ్జల రవీందర్ రెడ్డి, గోదా వెంకటేశ్వర్లు, బొబ్బల కేశవరెడ్డి, బొల్లెపల్లి కుమార్, ఐలు జిల్లా సహాయ కార్యదర్శి బొమ్మ వెంకటేశ్, సురకంటి జంగారెడ్డి, జి.లింగం, సురేశ్, చింతల రాజు పాల్గొన్నారు.